క్లుప్తంగా

వ్యాసరచన పోటీల్లో ప్రతిభ


సాయి కోమల్ మాధవి

నరసన్నపేట: సత్య సాయి సంస్థలు నిర్వహించిన జిల్లా స్థాయి వ్యాసరచన పోటీల్లో స్థానిక పద్మావతి జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థిని సి.హెచ్. సాయి కోమల్ మాధవి ద్వితీయ స్థానం కైవసం చేసుకున్నారు. సత్యసాయి 99వ జన్మదిన వేడుకల్లో భాగంగా ఈ పోటీలు నిర్వహించినట్లు కళాశాల డైరెక్టర్ దుర్గాప్రసాద్ శుక్రవారం తెలిపారు. మాధవికి సత్యసాయి సేవా సంస్థల నరసన్నపేట జోనల్ కన్వీనర్ వి.వి.ఎస్.ఎన్.మూర్తి, మహిళా సేవాదళ్ కో ఆర్డినేటర్ అమ్మాయమ్మ జ్ఞాపికను అందించారు.

చట్టాలపై అవగాహన అవసరం


మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి జ్యోత్స్న

పొందూరు: విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే చట్టాలపై అవగాహన పెంచుకోవాలని జూనియర్ సివిల్ జడ్జి బి.జ్యోత్స్న సూచించారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పొందూరు జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు ఆధ్వర్యంలో శుక్రవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. జడ్జి మాట్లాడుతూ బాల్య వివాహాల నిరోధక చట్టం, గంజాయి, మత్తుపదార్థాల వినియోగం వలన కలిగే దుష్ఫలితాలు, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, పోక్సో చట్టంపై అవగాహన కల్పించారు. హెచ్‌ఎం వెంకటరావు, న్యాయవాదులు పాల్గొన్నారు.

పెరటి తోటలతో లాభాలు


అక్కరాపల్లి అంగన్‌వాడీ కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన న్యూట్రీ గార్డెన్

హిరమండలం: పెరటి తోటల పంటల ద్వారా అంగన్‌వాడీ చిన్నారులకు పోషక విలువలు అందుతాయని ఐసీడీఎస్ కొత్తూరు సీడీపీఓ విమలకుమారి అన్నారు. మండలంలోని అక్కరాపల్లి, గొట్టా అంగన్‌వాడీ కేంద్రాల వద్ద ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఎంటీ సూర్యనారాయణ ఆధ్వర్యంలో పోషణ వాటిక న్యూట్రీ గార్డెన్లను శుక్రవారం ఏర్పాటు చేశారు. తోటకూర, గోంగూర, కొత్తిమీర, టమాటో, మిరప, వంగ, బెండ, చిక్కుడు, బీర తదితర పంటలకు సంబంధించిన నారును బీజామృతం ద్వారా శుద్ధి చేసి నాటారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుధావాణి, కార్యకర్తలు రజినీ, సరోజనమ్మ, యూనిట్ ఇన్‌చార్జీలు జగన్, రాములమ్మ, ఐసీఆర్పీ సభ్యులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత


మొక్కలు నాటుతున్న జూనియర్ సివిల్ జడ్జి మణి

కొత్తూరు: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని స్థానిక జూనియర్ సివిల్ జడ్జి ఎస్.మణి అన్నారు. జాతీయ న్యాయ సహాయ దినోత్సవం సందర్భంగా శుక్రవారం కొత్తూరు కోర్టు ఆవరణలో మొక్కలు నాటారు. కోర్టు సిబ్బంది, న్యాయవాదులు పాల్గొన్నారు.

అందుబాటులో చోడి విత్తనాలు

ఎల్.ఎన్.పేట: మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లోనూ చోడి (రాగి) విత్తనాలు అమ్మకానికి సిద్ధంగా ఉన్నాయని ఏఓ పైడి లతశ్రీ శుక్రవారం తెలిపారు. రబీలో సాగు చేసేందుకు మండలానికి రెండు క్వింటాళ్ల చోడి విత్తనాలు వచ్చాయన్నారు. రెండు కిలోల విత్తనాల ప్యాకెట్ ప్రభుత్వ రాయితీ పోను రూ.72.50లకు విక్రయిస్తున్నట్లు తెలిపారు. విత్తనాలు కావాల్సిన రైతులు వారి పరిధిలోని రైతు సేవా కేంద్రాలకు వెళ్లి కొనుగోలు చేసుకోవాలని సూచించారు.

నేడు మండల సమావేశం

కొత్తూరు: ఈ నెల 9వ తేదీన మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ సవర సావిత్రి అధ్యక్షతన నిర్వహించనున్నారు. ఈ మేరకు ఎంపీడీఓ నీరజ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11.30 గంటలకు మండల పరిషత్ సమావేశం మందిరంలో సమావేశం ప్రారంభమవుతుందన్నారు. మండలంలోని అన్ని శాఖలకు చెందిన అధికారులు పూర్తి వివరాలతో హాజరుకావాలన్నారు. ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొనాలని కోరారు.

అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే లక్ష్యం

పొందూరు: ప్రతి ఒక్కరినీ అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ఉల్లాస్ పథకం పనిచేస్తోందని ఎంపీడీఓ మీసాల మన్మధరావు అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉల్లాస్ పథకం, జీవితకాల అభ్యసనపై ఎస్‌హెచ్‌జీ సంఘాల్లోని మహిళలకు శిక్షణ ఇచ్చారు. ఏపీఎం మూర్తి పాల్గొన్నారు.

సారవకోట: గ్రామాల్లో అక్షరాస్యత శాతం పెంచాలని ఎంపీడీఓ కృష్ణ మోహన్ అన్నారు. మండల వెలుగు సమావేశ మందిరంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ప్రతిఒక్కరికీ ఆర్థిక, బ్యాంకింగ్, సామాజిక విషయాలలో అవగాహన కల్పించాలన్నారు.

- కోత యంత్రాలకు డిమాండ్
- పెరిగిన కోత యంత్రాల అద్దె, కూలీల వేతనం
- ఖరీఫ్ సాగులో అన్నదాతను ఆదుకోని కూటమి ప్రభుత్వం
- వ్యవసాయ పనుల్లో బిజీగా అన్నదాతలు


తురకపేట వద్ద యంత్రంతో వరి పంట కోస్తున్న దృశ్యం

రైతన్నకు.. పెట్టుబడి భారం

ఎల్.ఎన్.పేట:

ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొని, అప్పులు చేసి సాగుచేసిన ఖరీఫ్ వరి పంట కోతకు సిద్ధమైంది. ఈ సమయంలోనూ రైతులకు పెట్టుబడి భారం తప్పటం లేదు. ఖరీఫ్ వరి కోతలు గత వారం రోజులుగా చురుగ్గా జరుగుతున్నాయి. గత ఏడాదితో పోల్చిచూస్తే ఈ ఏడాది పెట్టుబడి పెరిగిపోతోందని రైతులు ఆందోళన చెందుతున్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో ఒకటైన అన్నదాత సుఖభవ పథకాన్ని అమలు చేస్తే కొంతమేర వెసులుబాటు ఉండేదని రైతులు అంటున్నారు.


కృష్ణాపురం ప్రాంతంలో వరిచేను కోత కోస్తున్న కూలీలు

యంత్రాలకు పెరిగిన గిరాకీ..

వరి కోత యాంత్రాలకు గిరాకీ పెరిగింది. కోత యంత్రం అద్దెకు తీసుకుని వస్తే నాలుగైదు రోజులు పని దొరకాలని, అలా కాకుంటే తాము రాలేమని యంత్రాల యజమానులు స్పష్టం చేస్తున్నారు. రవాణా ఖర్చులతోపాటు గంటకు రూ.2,500 వరకు అద్దె చెల్లించాల్సి ఉంటుందని తేల్చిచెబుతున్నారు. మరోవైపు కూలి రేట్లు పెరిగిపోవటం, కూలీలు లభించకపోవటంతో ఏం చేయాలో తెలియని దుస్థితిలో రైతులు ఉన్నారు. కోత యంత్రానికి గత ఏడాది కంటే అదనంగా రూ.300 వరకు చెల్లిస్తున్నారు. అడిగినంత అద్దె ఇస్తామని రైతులు అంగీకారం తెలియజేసినప్పటికీ కోత యంత్రాలు దొరక్కపోవడంతో పక్క గ్రామాలకు పరుగులు తీస్తున్నారు.

పాతపట్నం నియోజకవర్గంలో వరిపంట సాగువివరాలు ఇలా..

నియోజకవర్గంలో రెవెన్యూ గ్రామాలు:	233
మొత్తం రైతులు:	52,076 మంది
కౌలు రైతులు:	2,892 మంది
ఈ ఏడాది మొత్తం సాగు విస్తీర్ణం:	78,160 ఎకరాలు
వరి వెదలు వేసిన విస్తీర్ణం:	51,275 ఎకరాలు
వరి నాట్లు వేసిన విస్తీర్ణం:	26,885 ఎకరాలు

పెరిగిన కూలి రేట్లు..

గతేడాది ఎకరా వరి పంట కోతకు కూలీలకు రూ.3వేలకు పైగా చెల్లించారు. ఈ ఏడాది రూ.4,500 వరకు పెరిగింది. చేను కోతతోపాటు మోత, కుప్ప పెట్టడం, నూర్పిడి.. ఇలా ప్రతి సందర్భంలోనూ కూలీలు లేకుండా రైతులు వ్యవసాయ పనులు చేసుకునే పరిస్థితి లేదు. ప్రతీ పనికి పెట్టుబడి పెట్టుకుంటూ పోతే ఎకరాకు రూ.8 వేల నుంచి రూ.10 వేల ఖర్చు అవుతుందని రైతులు చెబుతున్నారు.

కోత యంత్రం దొరకటంలేదు



పంట పండింది కోద్దామంటే యంత్రాలకు గిరాకీ ఉంది. కోత యంత్రం కోసం ఉదయం నుంచి సాయంత్రం వరకు వేచి ఉంటే ఆ ప్రాంతంలో కోత పూర్తయితే మా పొలం వద్దకు వస్తామని చెబుతున్నారు. మా ప్రాంతంలో గత కొన్ని రోజులుగా ముమ్మరంగా కోతలు జరుగుతున్నాయి.

– బొడ్డేపల్లి రాజరత్నం, రైతు, తురకపేట, ఎల్.ఎన్.పేట

వ్యవసాయం కష్టంగా మారింది



గతంలో ఉన్నంతగా మా ఊరిలో కూలీలు లేరు. బతుకు దెరువుకోసం పట్టణాలకు వలస వెళ్లిపోయారు. పండగలకు, బంధువుల ఇంట్లో జరిగే శుభ కార్యక్రమాలకు తప్ప.. గ్రామానికి రావడం లేదు. కూలీలు లేకపోవడం వలన వ్యవసాయం పనులు చేయడం కష్టంగా మారింది. గ్రామంలో ఉన్న కొద్ది మంది కూలీలు కూడా రోజు కూలి ఎక్కువ అడుగుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో అన్ని పనులకు యంత్రాలపైనే ఆధారపడాల్సి వస్తోంది.

– పల్లి అప్పలనాయుడు, రైతు, దబ్బపాడు, ఎల్.ఎన్.పేట

స్థల పరిశీలన



సరుబుజ్జిలి మండలంలోని రొట్టవలస గ్రామ సమీపంలో గల వంశధార 27–ఎల్ పిల్ల కాలువ నుంచి మెట్ట పొలాలకు సాగునీరు అందించేందుకు ఎత్తిపోతల పథకం ఏర్పాటుకు ఇరిగేషన్ డీఈ కామరాజు శుక్రవారం క్షేత్రస్థాయి స్థల పరిశీలన చేశారు. గోపిగారి బంద నుంచి తిప్పిరి బంద వరకు ప్రత్యేక కాలువ లేదా పైప్‌లు ఏర్పాటు చేస్తే 100 ఎకరాలకు సాగునీరు అందుతుందని రైతులు తొత్తడి వైకుంఠరావు, తాడేల రాజారావు, దాలినాయుడు, బెవర లక్ష్మన్నాయుడు కోరారు. పరిస్థితులను అంచనా వేసి తదుపరి చర్యలు తీసుకుంటామని డీఈ తెలిపారు. పరిశీలనలో ఏఈ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

– సరుబుజ్జిలి

అభినందన



రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీల్లో బూర్జ మండలంలోని ఓ.వి.పేట గ్రామానికి చెందిన బుడుమూరు స్పందన అండర్ 17 విభాగంలో 200 మీటర్ల ఫ్రీస్టైల్ ఈవెంట్‌లో రెండో స్థానంలో నిలిచి సిల్వర్ మెడల్ సాధించింది. ఇదే విభాగంలో 400 మీటర్ల ఫ్రీస్టైల్ ఈవెంట్‌లో మూడో స్థానంలో నిలిచి బ్రాంజ్ మెడల్‌తో సత్తా చాటింది. స్విమ్మింగ్‌లో రాణిస్తున్న స్పందనను, కోచ్‌లు శుభం, కిశోర్, ఎస్.జి.ఎఫ్ కోచ్ జ్యుతిని ప్రముఖ వైద్యులు, శ్రీకాకుళం లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సురేష్, కళింగ సంక్షేమ సంఘం జాతీయ గౌరవాధ్యక్షుడు బుడుమూరు శ్రీరామ్మూర్తి, వైస్ ఎంపీపీ బుడుమూరు సూర్యారావు అభినందనలు తెలిపారు. ఈ పోటీలు గుంటూరు జిల్లా నరసారావుపేటలో మంగళవారం నుంచి గురువారం వరకు ఆంధ్రప్రదేశ్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించినట్లు కోచ్‌లు తెలిపారు.

– బూర్జ

అప్రమత్తం..



గ్రామాల్లో అనుమానితుల సమాచారాన్ని పోలీసులకు అందించాలని పోలాకి ఎస్‌ఐ రంజిత్ ప్రజలను కోరారు. శుక్రవారం ప్రియాగ్రహారంలో స్థానికులతో అవగాహన సమావేశం నిర్వహించారు. ఇటీవల మండలంలో జరిగిన ఘటనల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. దొంగతనాలు, రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించారు. గ్రామాల్లో వర్గవిభేదాల కారణంగా నెలకొనే వివాదాల్లో యువత దూరంగా ఉండాలని సూచించారు. మహిళలు బంగారు ఆభరణాలతో ఒంటరిగా ప్రయాణించడం, అపరిచితులతో మాట్లాడటం చేసేటప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

– పోలాకి

ప్రమాదకర ప్రయాణం..



కళాశాలలు, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులకు ప్రయాణ కష్టాలు తప్పడం లేదు. సరిపడా బస్సులు లేకపోవడంతో ప్రతీరోజు ప్రమాదకర పరిస్థితుల్లో ప్రయాణిస్తున్నారు. హిర మండలం వైపు నుంచి పాతపట్నం వచ్చే ఆర్టీసీ బస్సులు, టెక్కలి నుంచి పాతపట్నం వచ్చే బస్సులు ఉదయం, సాయంత్రం వేళ ప్రయాణికులతో రద్దీగా ఉంటున్నాయి. పాతపట్నం విద్యార్థులు ఫుట్‌పాత్‌పై ప్రయాణించాల్సిన దుస్థితి నెలకొంది. విద్యార్థుల కోసం స్టూడెంట్ బస్సులు ప్రత్యేకంగా నడిపిస్తామని ఆర్టీసీ అధికారులు చెబుతున్నా.. వాస్తవానికి అవి ఎక్కడా కనిపించిన దాఖలాలు లేవు.

– పాతపట్నం

అనధికార వసూళ్లపై చర్యలు తీసుకోవాలి

నరసన్నపేట: స్థానిక మేజరు పంచాయతీ కార్యాలయంలో ప్రతీ పనికి అనధికార వసూళ్లు పెరిగిపోయాయని, వీటిపై చర్యలు తీసుకోవాలని సభ్యులు కోరారు. సర్పంచ్ బూరల్లి శంకర్ అధ్యక్షతన శుక్రవారం పంచాయతీ సమావేశం నిర్వహించారు. జనన, మరణ ధ్రువీకరణ పత్రాలకు డబ్బులు వసూలు చేస్తున్నారని, ఇవి అధికారికమైతే ఆ డబ్బులు ఏం చేస్తున్నారని, వాటికి లెక్కలు ఉంటే చూపండి అని వార్డు సభ్యులు ఆర్.శ్రీధర్, తదితరులు పంచాయతీ సిబ్బందిని ప్రశ్నించారు. అటువంటి వాటిపై చర్యలు తీసుకుంటామని ఈఓ ద్రాక్షాయిని హామీ ఇచ్చారు. పంచాయతీలో ఏ కార్యక్రమం చేపట్టినా సభ్యులకు తెలియజేయాలని, సభ్యుల ఆమోదం తీసుకోవాలని, సమావేశంలో చర్చించిన తరువాతే అమలు చేయాలని సభ్యులు కేసీహెచ్‌బీ గుప్త, పాట్నూరు కృష్ణప్రసాద్, బీఎల్ శర్మ కోరారు. ఇటీవల పంచాయతీ పారిశుధ్య కార్మికుల తోపాటు కాంట్రాక్టు కార్మికులకు వేతనాలు పెంచారని, పంచాయతీ తీర్మానం లేకుండా ఎలా అమలు చేశారని సభ్యులు ప్రశ్నించారు. ఇకనుంచి తగిన జాగ్రత్తలు తీసుకుంటామని ఈఓ అన్నారు. వీటితో పలు అంశాలపై చర్చించారు. ఉప సర్పంచ్ ఎస్.కృష్ణబాబు, వార్డు సభ్యులు రామారావు, నీలం, ఎంపీటీసీ రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న సర్పంచ్, వార్డు సభ్యులు, పంచాయతీ సిబ్బంది

పశుగణన పక్కాగా చేపట్టాలి


మాట్లాడుతున్న ఏడీ కరుణాకరరావు

పాతపట్నం: అఖిల భారత పశుగణన పశుసంవర్థశాఖ సిబ్బంది పక్కాగా చేపట్టాలని పాతపట్నం పశుసంవర్థకశాఖ సహాయ సంచాలకులు డాక్టర్ మంచు కరుణాకరరావు అన్నారు. స్థానిక కోర్టు కూడలిలో ఉన్న పశుసంవర్థకశాఖ ఏడీ కార్యాలయంలో పశుగణనపై పశువైద్యులకు, సిబ్బందికి శుక్రవారం ఒక్కరోజు శిక్షణ తరగతిని ఏడీ నిర్వహించారు. ఎన్యుమరేటర్లు పూర్తి సమాచారం సేకరించాలన్నారు. ప్రతీ ఎన్యుమరేటరు రోజుకు 30 నుంచి 40 ఇళ్లకు వెళ్లి సర్వే చేయాలని సూచించారు. పశుగణన ఆన్‌లైన్ విధానంలో జరుగుతుందన్నారు. పశుగణన వల్ల భవిష్యత్‌లో పశుసంవర్థక శాఖలో ప్రణాళికలు రచించుకోవడానికి, పథకాల రూపకల్పనకు, బడ్జెట్ ప్రతిపాదనలకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కొరసవాడ, పెద్దలోగిడి పశువైద్యులు పి.అనిల్ కుమార్, కె.మౌనిక, పాతపట్నం, మెళియాపుట్టి మండలాలకు చెందిన పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సైబర్ మోసాలపై అప్రమత్తం

ఆమదాలవలస: సైబర్ మోసాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ కె.వెంకటేష్ సూచించారు. శుక్రవారం పురపాలక సంఘంలోని వెంగళరావు కాలనీలో మహిళలకు అవగాహన కల్పించారు. రుణాలు ఇప్పిస్తామని ఎవరైనా ఫోన్‌చేసి వివరాలు అడిగితే అటువంటి వారికి సమాచారం ఇవ్వవద్దని సూచించారు. ఏటీఎం కేంద్రాల వద్ద గుర్తుతెలియని వ్యక్తులకు కార్డు ఇచ్చి డబ్బులు తీయమని కోరవద్దన్నారు. ఏటీఎం పిన్, బ్యాంక్ అకౌంట్ వివరాలను ఎవరైనా అడిగితే చెప్పవద్దన్నారు. గుర్తింపులేని, గుర్తుతెలియని వ్యక్తులు నిర్వహించే చిట్ ఫండ్‌లలో చిట్స్ కట్టి మోసాలకు గురికావద్దన్నారు. ఎవరైనా సైబర్ మోసాలకు గురైనప్పుడు వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. గంజాయి విక్రయించే వారి వివరాలు తెలిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని, అటువంటివారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.


అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ వెంకటేష్

ఒడిశాకు తరలిపోతున్న ధాన్యం!

పాతపట్నం: మండల రైతులకు ఖరీఫ్ కష్టాలు వెంటాడుతూనే ఉన్నాయి. పెట్టుబడులు కూడా రాని పరిస్థితి ఏర్పడింది. పండిన అరకొర పంటకు గిట్టుబాటు ధర లభిస్తుందని ఆశ పడినవారికి నిరాశే మిగిలింది. ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించడం కానీ, కొనుగోలు కేంద్రాలు తెరవడం కానీ చేయలేదు. వ్యాపారస్తులు చెప్పిన ధరకే విక్రయిస్తున్నారు. మండలంలోని పాతపట్నం, బూరగాం, కాగువాడ, కొరసవాడ, సీది, రొంపివలస, ఆర్.ఎల్.పురం, గంగువాడ, తెంబూరు, సరాళి గ్రామాల నుంచి ఒడిశా, కాకినాడ, రాజమండ్రి ఇతర ప్రాంతాలకు ధాన్యం తరలిపోతున్నాయి. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని పలువురు కోరుతున్నారు.


సీది కూడలి వద్ద లారీలోకి ధాన్యం బస్తాలను లోడ్ చేస్తున్న దృశ్యం

ప్రభుత్వ స్థలాలను కాపాడాలి

పాతపట్నం: మండలంలోని కొదూరు గ్రామ పంచాయతీ ప్రహరాజపాలెం రెవెన్యూ పరిధిలోని ప్రభుత్వ భూములు, చెరువులు కబ్జాకు గురయ్యాయని, వాటిని కాపాడాలని రీ సర్వే డీటీ సునిల్‌కుమార్‌కు సర్పంచ్ పసుకు నాగమణితోపాటు గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. కొదూరులో శుక్రవారం గ్రామ రెవెన్యూ సమావేశం నిర్వహించారు. భూ సమస్యలపై పలువురు రైతులు దరఖాస్తులు అందించారు. రీ సర్వే సర్వేయర్ నారాయణరావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

15 లోగా బీమా ప్రీమియం చెల్లించాలి

కొత్తూరు: ఈ నెల 15వ తేదీ లోగా మీ–సేవా కేంద్రాల్లో వాతావరణ ఆధారిత పంటల బీమా పథకానికి సంబంధించి రైతులు ప్రీమియం చెల్లించాలని స్థానిక ఉద్యానవన అధికారి బి.అయింతికుమారి తెలిపారు. మండలంలోని ఆల్తి పంచాయతీ తామరగూడ గిరిజన గ్రామంలో శుక్రవారం జీడిమామిడి రైతులతో సమావేశం నిర్వహించారు. ఎకరా జీడిమామిడి పంటకు రూ.1,600, హెక్టార్‌కు రూ.4,000 ప్రీమియం చెల్లించాలన్నారు. జీడి మామిడికి వస్తున్న తెగుళ్లు, పరుగుల నివారణపై అవగాహన కల్పించారు. వీఏఏ దివాకర్, బీమా పథకం కంపెనీ ప్రతినిధి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నాక్ బృందం పర్యటన విజయవంతం

ఆమదాలవలస: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 6, 7వ తేదీల్లో నాక్ బృందం పర్యటించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఎన్.ఎస్.ఎన్ స్వామి శుక్రవారం తెలిపారు. దేశంలోని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థలను ఐదేళ్లకు ఒకసారి మూల్యాంకనం చేసి గ్రేడ్‌ను ఇస్తుందన్నారు. ముగ్గురు సభ్యులు కలిగిన నాక్ బృందం పర్యటించిందన్నారు. టీచింగ్, లెర్నింగ్ పద్ధతులు, వనరులు, విలువలు, బోధనా పద్ధతులు, పరిశోధనలు, సామాజిక బాధ్యత తదితర అంశాలపై సమగ్ర పరిశీలన జరిపినట్లు తెలిపారు. కళాశాలకు ఏ విధమైన గ్రేడ్ నిర్ణయించారో త్వరలో అధికారిక ప్రకటన వస్తుందన్నారు. నాక్ బృందం పర్యటన విజయవంతం కావడానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లకు షోకాజ్ నోటీసులు జారీ

ఆమదాలవలస: మండలంలోని నెల్లిపర్తి, వంజంగి గ్రామాలకు చెందిన ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్లు మానుకొండ మురళీధర్, పూజారి సతీష్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు ఏపీఓ సురవరపు లక్ష్మీనరసమ్మ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నెల్లిపర్తిలో మురళీధర్.. రూ.4 లక్షలకు పైగా అవకతవకలకు పాల్పడినట్లు సామాజిక తనిఖీ బృందం గుర్తించిందన్నారు. గ్రామ సభకు, మండలంలో జరిగిన సామాజిక తనిఖీ సభకు మురళీధర్ హాజరుకాలేదన్నారు. వంజంగికి చెందిన సతీష్.. రూ1,85,000లకు పైగా అవకతవకలకు పాల్పడ్డారన్నారు. వీరిద్దరూ వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులు కావడంతోనే కూటమి నాయకులు కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నట్లు ఆయా గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఏపీఓకు నిజానిజాలు తెలిసి కూడా.. నోరు మెదపకపోవడంలోని ఆంతర్యమేమిటని ప్రశ్నిస్తున్నారు.

స్కూటీ చోరీ..

పొందూరు: మండలంలోని దళ్లవలస గ్రామంలో కొంచాడ సూర్యనారాయణకు చెందిన స్కూటీ గురువారం అర్ధ రాత్రి చోరీకి గురైంది. శుక్రవారం ఉదయం లేచి చూసే సరికి తన ఇంటి ముందు స్కూటీ లేకపోవడంతో చోరీకి గురైందని గుర్తించారు. పొందూరు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నామని ఎస్‌ఐ సత్యనారాయణ చెప్పారు.

బాల్య వివాహాల కట్టడికి నిఘా అవసరం

- బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు సీతారాం

నరసన్నపేట: గ్రామాల్లో బాల్య వివాహాలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళా పోలీసులు, ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలతో వేర్వేరుగా సమావేశాలు ఏర్పాటు చేశారు. బాల్య వివాహాలపై తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, పోలీసులు, వీఆర్వోలు, మహిళా పోలీసులు, ఉపాధ్యాయులు, గ్రామ స్థాయిలో ఉన్న ప్రభుత్వ సిబ్బంది బాల్య వివాహాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. జిల్లా బాలల సంరక్షణ విభాగం, స్త్రీ శిశు సంక్షేమం శాఖ అధికారులు సంయుక్తంగా పనిచేయాలన్నారు. తొలిత నరసన్నపేట ఆర్టీసీ కాంప్లెక్స్‌లో మదర్ ఫీడింగ్ రూమ్‌ను ప్రారంభించారు. కాంప్లెక్స్‌లో ఫీడింగ్ రూమ్ ఏర్పాటుకు సహకరించిన ఆర్టీసీ టెక్కలి డిపో మేనేజర్ వెంకటేశ్వరరావును అభినందించారు. అనంతరం స్థానిక నారాయణ స్కూల్‌ను పరిశీలించారు. తరగతి గదుల్లో కొంత మంది విద్యార్థులను నేలపై కూర్చోబెట్టడం, మరి కొందరిని బెంచీలపై కూర్చోబెట్టడాన్ని గుర్తించి తీవ్రంగా హెచ్చరించారు. ఇటువంటి తారతమ్యాలు విద్యార్థుల్లో చూపవద్దని, వారి మనోభావాలు దెబ్బతినకుండా చూడాలన్నారు. ఐసీడీఎస్ పీఓ నాగమణి, జిల్లా బాలల సంరక్షణాధికారి వెంకటరమణ, ఎంపీడీఓ మధుసూదనరావు, ఎస్‌ఐ దుర్గాప్రసాద్, కార్మిక సంక్షేమ అధికారి విజయ్‌శంకర్, ఎంఈఓ శాంతారావు పాల్గొన్నారు.


ఆర్టీసీ కాంప్లెక్స్‌లో మదర్ ఫీడింగ్ రూమ్‌ను ప్రారంభిస్తున్న గొండు సీతారాం

24న హిందూ ధార్మిక మహా సమ్మేళనం


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న స్వామి శ్రీనివాసనంద సరస్వతి, తదితరులు

కొత్తూరు: ఈ నెల 24వ తేదీన పొందూరు మండలం గారపేట ఆనందాశ్రమం వద్ద హిందూ ధార్మిక మహా సమ్మేళనాన్ని నిర్వహించనున్నట్లు ఏపీ సాధు పరిషత్ అధ్యక్షుడు, ఆనందాశ్రమ పీఠాధిపతి స్వామి శ్రీనివాసానంద సరస్వతి తెలిపారు. కొత్తూరులోని సీతారామ మందిరంలో శుక్రవారం రాత్రి మహా సమ్మేళనం కరపత్రాలను ఆవిష్కరించారు. శ్రీనివాసానంద సరస్వతి మాట్లాడుతూ హిందూ ధర్మాన్ని భవిష్యత్ తరానికి అందించే దిశగా ప్రతీ హిందువు కృషి చేయాలని కోరారు. హైందవ సమాజం ప్రస్తుతం ఎదుర్కొంటున్న సవాళ్లపై లోతుగా చర్చించేందుకు ఇటువంటి ధార్మిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. టీటీడీ ఆధ్యాత్మిక మండలి కన్వీనర్ పొగిరి రవి, ప్రముఖ ప్రవచనకర్త యాలాల శ్రీనివాసరావు, ఆలయ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.